

నిర్మానుష్యంగా మఠంపల్లిలోని ప్రధాన రహదారి

## భానుడి భగ భగ..

మఠంపల్లి, జూన్ 7: గత నాలుగైదు రోజులుగా ఎండ తీవ్రత భారీ స్థాయిలో పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోహిణి కార్తె చివరి రోజు అత్యవసరం ఉన్న వారు మినహా ఎవరూ బయటకు రాలేదు. మధ్యాహ్నం సమయంలో మఠంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. నిత్యం ప్రజలు, వాహనదారులతో రద్దీగా ఉండే మఠంపల్లి మండల కేంద్రం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గకపోవడంతో రోడ్లన్నీ జన సంచారం లేక వెల వెల బోయాయి. ఇక్కడ 41.9 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలు

## 'కగార్' హత్యాకాండను ఆపాలి

కోదాడ రూరల్, జూన్7: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యంలో సాగిస్తున్న మానవ హత్యాకాండను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మిట్టగనుపుల ముత్యాలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌కౌంటర్ పేరుతో మావోయిస్టు అగ్ర నాయకులు నంబాల కేశవరావు, సుధాకర్‌తో పాటు 27 మందిని దారుణంగా కాల్చి చంపడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. చర్చలకు సిద్ధమని మావోయిస్టులు చెబుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడం దారుణమని మండిపడ్డారు. అమానవీయంగా మావోయిస్టులను తుడిచిపెట్టడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. ఇప్పటికైనా చర్చలకు పిలవాలని, సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో కుక్కడపు నళిని, దాసరి శ్రీనివాస్, కర్ణకోటి నవీన్, జి.మరియన్న, నక్క గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిప్పర్లలో మట్టి తరలింపు

## అక్రమంగా మట్టి తరలింపు

నూతనకల్, జూన్ 7: మండల పరిధిలోని మిర్యాల గ్రామంలోని కుంటకట్ట చెరువు నుంచి జేసీబీలు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములు ధ్వంసమవుతున్నాయని వాపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపును అరికట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జనరల్ బాడీ తీర్మానం మేరకే బహిరంగ వేలం

కోదాడ, జూన్ 7 : జనరల్ బాడీ తీర్మానం మేరకే పబ్లిక్ క్లబ్ కొత్త భవనం బహిరంగ వేలం నిర్ణయం తీసుకున్నామని కోదాడ పబ్లిక్ క్లబ్ కార్యదర్శి బొల్లు రాంబాబు అన్నారు. శనివారం కోదాడ పబ్లిక్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. భవనం బహిరంగ వేలంపై కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. భవనం అమ్మకానికి సంబంధించి అన్ని సామాజిక వర్గాలతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్లబ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల సంప్రదింపులతోనే బహిరంగ వేలం ప్రక్రియ జరుగుతుందని వివరించారు. పాలకవర్గం అమ్మకం కమిటీల నిర్ణయం మేరకు నేడు వేలం ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ చింతలపాటి శేఖర్, కార్యవర్గ సభ్యులు గుండపునేని వేణు పాల్గొన్నారు.

# తిరుమలగిరిలో సమస్యల తిష్ట

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- దోమలు, ఈగలతో సహవాసం
- శివారు ప్రాంతాలు పట్టని అధికారులు
- తిరుమలగిరి మున్సిపాలిటీ తీరిది..
- డ్రైనేజీ, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు



తిరుమలహిల్స్ నుంచి పద్మశాలి కాలనీ 30 ఫీట్ల రోడ్డులో ప్రవహిస్తున్న వర్షం నీరు (ఫైల్)



5వ వార్డులో ఇండ్ల మధ్య నిలిచిన మురుగు

తిరుమలగిరి జూన్ 7: తిరుమలగిరి మున్సిపాలిటీలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. పలు వార్డుల్లో డ్రైనేజీ కాల్వలు లేకపోవడంతో ఇండ్ల మధ్యలోనే మురుగు పారుతోంది. దీంతో కాలనీలు ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారాయి. అంతేకాకుండా పందులు విపరీతంగా మురుగులో సంచరించడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని వాపోతున్నారు. మున్సిపాలిటీ స్థాయిలో ఇంటి బిల్లులు వసూలు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు డ్రైనేజీ, సీసీ రోడ్డు, తాగునీటి నల్లాల కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పైపు లైన్లు, నల్లా కనెక్షన్లు తప్పా నూతనంగా ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

### శివారు ప్రాంతాల్లో అధికం..

తిరుమలగిరి మున్సిపాలిటీలో మాలీపురం, నందాపురం, అనంతారం గ్రామాలను విలీనం చేశారు. ఈ శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ లేకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో జనావాస ప్రాంతాల్లో విషపురుగులు సంచరిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు, డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్డు లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి డ్రైనేజీ కాల్వలు నిర్మించి మురుగు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### కొన్ని ప్రాంతాలకే పరిమితం..

మున్సిపాలిటీలో చెత్త సేకరణ వాహనాలు మండల కేంద్రంలోని కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. అనేక కాలనీల్లో, వార్డుల్లో ఈ వాహనాలు నెలలు గడిచినా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని వీధుల్లో మాత్రమే చెత్త సేకరిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

### అభివృద్ధి కాగితాలకే పరిమితం..

సూర్యాపేట జాతీయ రహదారి నుంచి పద్మశాలి కాలనీకి వెళ్లే 30 ఫీట్ల దారిలో డ్రైనేజీ లేకపోవడంతో ఇండ్ల మధ్యనే మురుగు నిలుస్తుంది. కంప చెట్లు పెరగడంతో నడిచేందుకు ఇబ్బందిగా మారింది. చెత్త సేకరణ వాహనాలు 10 రోజులకో సారి కూడా రావడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది.

**– వెంకటేశ్వర్లు, మాలీపురం**

### శివారు ప్రాంతాలపై దృష్టి పెట్టాలి..

శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో కాలనీల్లో తిరిగేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో లేవు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

**–నరేశ్, తిరుమలగిరి**

# పాలకవీడులో ఈదురు గాలుల బీభత్సం





పాలకవీడు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీగా ఈదరుగాలులతో కూడిన వర్షం కురిసింది. గుడుగుంట్లపాలెం– పాలకవీడు మధ్య ఉన్న రహదారిపై వృక్షాలు నేలకొరిగాయి. దీంతో నేరేడుచర్ల– జాన్‌పహాడ్ రహదారిపై వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎస్ఐ లక్ష్మీనారాయణ రహదారిపై చెట్లను తొలగించే చర్యలు చేపట్టి ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. –పాలకవీడు. జూన్7



నేరేడుచర్లలో బడిబాటలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య

నేరేడుచర్ల, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ చిన్నారులను చేర్పించాలని నేరేడుచర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు అన్నారు. శనివారం బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరబాబు, సైదులు, జానకిరాములు, వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ, నాగమణి, భానుమతి, బాలు, యాదగిరి, కట్టా శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కరక్కాయల గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగమోహన్‌రావు, బి.వెంకన్న, పి.అంజయ్య, వీరయ్య తదితరులున్నారు.

### తుంగతుర్తిలో...

తుంగతుర్తి, జూన్ 7 : వెంపటి గ్రామంలో నిర్వహించిన బడిబాటలో ప్రభుత్వ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు వెంకటనర్సమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో టీచర్లు, ఉపాధ్యాయ బృందం, పాలకుర్తి ఎల్లయ్య, రవీందర్, మాధవి, బండారు భవాని, నవీన, అనిల్‌కుమార్, విక్రం, కృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పరిశుభ్రత మన బాధ్యత

నేరేడుచర్ల, జూన్ 7 : మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాని కోసం కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీల్లో చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 6, 10 వార్డుల్లో తడి, పొడి చెత్త, ఎరువు తయారీ విధానంపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య వాహనాలు వచ్చినప్పుడు వారికి అందించాలని సూచించారు. వాటర్ ట్యాంకుల ద్వారా సప్లయి చేసే నీటిని క్లోరిన్ టెస్టులు చేసి పరిశీలించారు. వార్డుల్లో మురుగు కాల్వలు పూడిక తీసి నిరుపేద మహిళలను గుర్తించి సమభావన సంఘాలు ఏర్పాటు చేయడానికి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, రిటైర్డ్ ఉద్యోగి పూర్ణచంద్రా రెడ్డి, వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆర్పీలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్త, ఎరువు తయారీ విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి, అధికారులు, ప్రజలు

## జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

నాగారం, జూన్ 7: మండల పరిధిలోని పసునూరు తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన ఎడ్ల ఆర్యన్, మార్గం శ్రీతన్, దరావత్ శరత్ ఎంపికైనట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉపకార వేతనం పొందుతారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



ఎర్రవరంలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

## సర్వాయి పాపన్న ఆశయాలు సాధించాలి

కోదాడ రూరల్, జూన్ 7: బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాల సాధన కోసం ప్రతి గౌడ కులస్తుడు కృషి చేయాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ డైరెక్టర్ మారగాని శంకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎర్రవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు పెండెం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు బెల్లంకొండ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బూర శ్రీనివాస్‌గౌడ్, బెల్లంకొండ ఉపేందర్‌గౌడ్, గౌడ పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి, జూన్ 7 : సూర్యాపేట ఐ లయన్స్ క్లబ్ తుంగతుర్తి లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో తుంగతుర్తి పట్టణ కేంద్రంలో రిటైర్డ్ టీచర్ విశ్రాంత భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ డీఎంటి కోఆర్డినేటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలతో పాటు సూర్యాపేట లయన్స్‌క్లబ్‌లో ఆపరేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పుల రాజేంద్రప్రసాద్, కొండపల్లి లక్ష్మారెడ్డి, కొండా సంతోశ్, పులుసు వెంకన్న, ఓరుగంటి సుభాశ్, ఓరుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మేళ్లచెర్వు, జూన్ 7: మండల పరిధిలోని కందిబండలో భారతీ విద్యామందిర్‌లో గతంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను గుర్తుకు తెచ్చుకొని ఉల్లాసంగా గడిపారు. కరస్పాండెంట్ పత్తిపాటి నాగిరెడ్డి దంపతులను శాలువాలతో సన్మానించారు.

## రైతులకు అవగాహన సదస్సు

గరిడేపల్లి, జూన్ 7 : గడ్డిపల్లి కేవీకే ఆధ్వర్యంలో నడిగూడెం మండలంలోని రైతువేదికలో శనివారం రైతు సదస్సు నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతులకు ప్రతి నెల అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

సూర్యాపేటటౌన్, జూన్ 7 : హుజూర్‌నగర్‌లో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లా, మండల కమిటీ సభ్యులకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**FINANCE**
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

**WANTED**
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All


**PLOT FOR SALE**
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777625, 9182777635 | | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |


# త్యాగానికి ప్రతీక బక్రీద్



హుజూర్‌నగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బాషనాయక్‌తండా వద్ద ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌కే రఫీ



కోదాడ ఈద్గా వద్ద ప్రార్థనల్లో ముస్లింలు

సూర్యాపేట రూరల్, జూన్ 7: త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగ వేడుకలు శనివారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్, బాషనాయక్‌తండా వద్ద గల ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ముస్లిం సోదరులకు రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, 13వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ, నాయకులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

### కోదాడలో..

కోదాడ, జూన్ 7: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని కోదాడ పెద్ద మసీదు ఇమామ్ మౌలానా అబ్దుల్ రషీద్ అన్నారు. శనివారం పట్టణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. స్థానిక సాలార్జింగ్ పేట 9వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మదర్ సాహేబ్, సామూహిక ప్రార్థనల ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ కౌన్సిలర్లు, షేక్ మదర్ సాహేబ్, షమ్మీ, ఖాజా, బాగ్దాద్, బాజాన్, అలీబాయ్, ముస్తఫా, మజహర్, సాధిక్ పాల్గొన్నారు.

### పెన్‌పహాడ్‌లో...

పెన్‌పహాడ్, జూన్ 7: బక్రీద్ పర్వదిన వేడుకలను మండల వ్యాప్తంగా శనివారం ముస్లిం సోదరులు ప్రశాంతంగా నిర్వహించుకున్నారు. బీఆర్ఎస్ ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షులు షేక్ మస్తాన్, షేక్ హుస్సేన్, మదర్, షేక్ ఆజీద్, షరీఫ్‌హ, నాగల మీర పాల్గొన్నారు.

### తిరుమలగిరిలో..

తిరుమలగిరి, జూన్ 7: స్థానిక ఈద్గాలో ముస్లిం సోదరులు సామూహిక సమాజ్ నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. హిందూ సోదరులతో కలిసి అలాయ్ బలాయ్ తీసుకున్నారు.

### తుంగతుర్తిలో...

తుంగతుర్తి, జూన్ 7 : తుంగతుర్తి మండలంలో మత పెద్ద మౌలానా అబ్దుల్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్, జూన్7: హుజూర్‌నగర్‌లో మత గురువు గౌసుద్దీన్ మాట్లాడారు. అజీజ్ పాషా, సైదా, మన్సూర్ అలీ, బాజీవుల్లా, రఫీ, మొయిన్ పాల్గొన్నారు.

### మునగాలలో...

మునగాల, జూన్ 7: మండల కేంద్రంలో పాటు గ్రామాల్లోలో శనివారం బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్, జానిమియ, రషీద్, ముబిన్, మల్సూర్, దస్తగిరి, జాని తదితరులు పాల్గొన్నారు.

### గరిడేపల్లిలో...

గరిడేపల్లి, జూన్ 7: గరిడేపల్లిలో ముస్లిం సోదరులు శనివారం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. హిందూ, ముస్లిం సోదరులు కలిసి మత సామరస్యాన్ని చాటుకున్నారు.